
సాక్షి
ఒడిశా

శనివారం । 20 । ఏప్రిల్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

| | |
|---|---|
| నగదు | రూ.3,15,348 |
| బంగారం | 100 మిల్లీ గ్రాములు |
| వెండి | 62 గ్రాముల 300 మిల్లీ గ్రాములు |

– భువనేశ్వర్/పూరీ



సీతారాముల కల్యాణం చూతము రారండి..! - 8లో

రాష్ట్రవ్యాప్తంగా రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువుగా శుక్రవారం నిర్వహించారు.



వంతెన నిర్మించాలని వినతి

రాయగడ జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సింగారి పంచాయతీ పరిధి కంగొసిరి గ్రామస్తుల సౌకర్యార్థం నాగావళి నదిపై వంతెన ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. - 8లో

## న్యూస్‌రీల్

### నందన్‌కానన్ జూలో తెల్లపులి మృతి



స్నేహ (ఫైల్)

భువనేశ్వర్: నగర శివారులోని బారంగ్ నందన్‌కానన్ జూలాజికల్ పార్క్‌లో 14 ఏళ్ల తెల్లపులి 'స్నేహ' శుక్రవారం జూలో చికిత్స పొందుతూ మరణించింది. గురువారం అస్వస్థతకు గురవ్వడంతో సత్వర చికిత్స ప్రారంభించారు. వృద్ధాప్య సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న తరుణంలో తీవ్రమైన వడగాలుల కారణంగా ఆరోగ్య పరిస్థితి మరింత విషమించింది. స్నేహ 2010 మార్చి 1న జన్మించింది. 14 ఏళ్ల జీవిత కాలంలో 3 ఈతల్లో 9 పిల్లల తల్లిగా జూలో పులుల సంతతి వృద్ధికి తోడ్పడింది. వీటిలో 3 తెలుపు, 4 సాధారణ, 2 మెలనిస్టిక్ వన్నెల పులులు ఉండడం విశేషం. 2022 అక్టోబర్‌లో 11 ఏళ్ల తెల్లపులి బిజయ మృతి చెందింది. ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు గురై ఇది మరణించింది. అంతకుముందు 2019 అక్టోబర్‌లో కాలేయ సంబంధిత అనారోగ్యంతో సుభ్రాంశు అనే ఐదేళ్ల తెల్ల మగ పులి కూడా మరణించింది. నందన్‌కానన్ అధికారిక వనరుల సమాచారం ప్రకారం ప్రస్తుతం జూలో 27 పులులు ఉన్నాయి. వీటిలో సాధారణ పులులతో 7 తెలుపు మరియు 3 మెలనిస్టిక్ పులులు ఉన్నాయి.

### మావో డంప్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న డంప్‌లోని సామగ్రితో బీఎస్‌ఎఫ్ అధికారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి బోడిగేట్ట అడవిలో కూంబింగ్ నిర్వహించిన కోబ్రా, బీఎస్‌ఎఫ్ జవాన్లు మావోలు అమర్చిన భారీ డంప్‌ను వెలికితీశారు. వివరాల్లోకి వెళ్తే.. బేజాంగ్‌వాడ అడవిలో మావోల డంప్‌లు ఉన్నట్లు ఇంటలిజెన్స్ వర్గాల ద్వారా జిల్లా ఎస్పీ నితీష్ వాద్వానికి సమాచారం వచ్చింది. ఈ నేపథ్యంలో కోబ్రా, బీఎస్‌ఎఫ్ జవాన్లు ముమ్మరంగా గురువారం సాయంత్రం నుంచి కూంబింగ్ నిర్వహించారు. దీనిలో భాగంగా ఎలక్కనూర్ గ్రామం వద్ద డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. డంప్‌లో ఒక ఐఈడీ టిఫిన్ బాక్స్ బాంబ్, ఆరు గన్‌లు, 36 హైడ్ గ్రానేట్స్, రెండు సోలార్ ఎల్‌క్ట్రికల్ ప్యానెల్స్, ఒక గ్యాస్ సిలిండర్, 20 మీటర్ల కరెంట్ వైరు ఉన్నట్లు వెల్లడించారు. డంప్ స్వాధీనం చేసుకున్న జవాన్లను అధికారులు అభినందించారు.

### నలుగురు దోపిడీ దొంగలు అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు

బరంపురం: నగర శివారులోని శ్రీక్షేత్ర విహార్ పక్కన పడియాలో దోపిడీకి సిద్ధమవుతున్న ముఠాని పోలీసులు అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి గోపినాథ్ ప్రధాన్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం అర్ధరాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో నిమ్మఖండి పోలీసుస్టేషన్ పరిధిలో అర్ధరాత్రి దోపిడీకి సిద్ధమవుతున్న ముఠా పోలీసుల కంటపడింది. దీంతో పోలీసులు వీరిని వెంబడించి చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో గంజాం జిల్లాలోని గంగపూర్ గ్రామానికి చెందిన తపన్ సాహు, పద్మపూర్ గ్రామానికి చెందిన నిమోయ్ చరణ్ నాయక్, తెంతులిఖండి గ్రామానికి చెందిన దేబనంద గౌడ, అస్కాకి చెందిన కె.సుర్యారావులు ఉన్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి 2 బైక్‌లు, తుపాకీ, 5 గుండ్లు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశారు.

### బీజేడీలోకి చేరికలు



పార్టీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న సూర్యారావు

పర్లాకిమిడి: గుమ్మా సమితి సభ్యులు బర్నింగ్ గొమాంగో, గుసాని సమితిలో ఎం.ఎస్.పూర్ పోలాకి విష్ణుప్రసాద్‌లు శుక్రవారం బీజేడీలో చేరారు. స్థానిక బీజేడీ పార్టీ కార్యాలయంలో మిశ్రణ్ పర్వ శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కెంగం సూర్యారావు కాంగ్రెస్ నుంచి బీజేడీలో చేరిన బర్నింగ్ గొమాంగో, విష్ణుప్రసాద్‌లను పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బీజేడీ పార్టీని వీడి ఇతర పార్టీలోకి వెళ్లినవారు పార్టీ ద్రోహులని బీజేడీ ఛత్ర విభాగం అధ్యక్షుడు సుర్జిత్ త్రిపాఠి అన్నారు.

## • ఓటెత్తాలి




ఓటుహక్కు వినియోగంపై జిల్లా యంత్రాంగం విరివిగా చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈసారి జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో 85 శాతంకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించే విధంగా ప్రణాళికలు రూపొందించింది. ఈ క్రమంలో జిల్లాలోని గుడారిలో శుక్రవారం ఓటుహక్కు వినియోగంపై చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. గుడారి పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీల్లో చైతన్యం కల్పించేవిధంగా సిబ్బంది బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. – రాయగడ

## • భద్రతకు హామీ

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు పారదర్శకతతో నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఖుర్దా శాసనసభ నియోజకవర్గం ప్రాంతంలో దుర్బలమైన మరియు క్లిష్టమైన పోలింగ్ స్టేషన్ ప్రాంతాల్లో రాష్ట్ర పోలీసులు, సాయుధ దళాలు ఫ్లాగ్ మార్చ్ శుక్రవారం నిర్వహించాయి. ప్రతీ ఓటరు నిర్భయంగా ఓటు వేసేందుకు భద్రత హామీ కల్పించడం లక్ష్యంగా ఈ వర్గాలు పేర్కొన్నాయి. – భువనేశ్వర్



## • ఘన స్వాగతం



రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఎన్నికల పరిశీలకుడు అతున్ సవ్యసాచి నాయక్, బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావుకు కాసీపూర్‌లో ఆ పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కాసీపూర్‌లో పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాసీపూర్ సీనియర్ నాయకుడు, రాయగడ శాసనసభ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి కృష్ణ మహాపాత్రో, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి తదితరులు పాల్గొన్నారు. – రాయగడ

# మహిళాభివృద్ధే బీజేడీ లక్ష్యం

- మంత్రి సవ్యసాచి నాయక్
- రాయగడలో భారీ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో బీజేడీ కార్యకర్తలు



బీజేడీలో చేరిన కాంగ్రెస్ యువనేత బాబు రాజ్‌గురు తదితరులు



గెలిపించమని అభ్యర్థిస్తున్న అనసూయా, కౌసల్యలు



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

రాయగడ: రాష్ట్రంలో మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సాహించి, అభివృద్ధిలో వారిని అగ్రస్థానంలో నిలపడమే బీజేడీ లక్ష్యమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, రాయగడ జిల్లా ఎన్నికల పరిశీలకుడు అతున్ సవ్యసాచి నాయక్ అన్నారు. స్థానిక తేజస్వీ హోటల్ మైదానంలో కొత్తగా నిర్మించిన బీజేడీ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ముందుగా స్థానిక కొత్త బస్టాండ్ వద్ద దివంగత ముఖ్యమంత్రి బిజు పట్నాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన భారీ బైకు ర్యాలీలో పాల్గొన్నారు. బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాయగడ శాసనసభ నుంచి పోటీ చేస్తున్న అనసూయా మాఝి, కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న కౌలస్య హికకలు ర్యాలీలో పాల్గొన్నారు. కొత్త బస్టాండ్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మెయిన్ మార్కెట్ మీదుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి తేజస్వీ మైదానం వరకు కొనసాగింది. వేల సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

**మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం**

అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో అతున్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చినట్లు తెలియజేశారు. మహిళల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి స్వయం సహాయక బృందాలు, మిషన్ శక్తి వంటి పథకాలను బీజేడీ ఏర్పాటు చేసిందని వెల్లడించారు. గడిచిన రెండు దశాబ్దాలుగా రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న బీజేడీ ప్రభుత్వానికి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. రాయగడ శాసనసభ, కొరాపుట్ లోక్‌సభ వంటి స్థానాల్లో మహిళలకు టిక్కెట్టు ఇచ్చి ఎన్నికల బరిలో నిలబెట్టిన నవీన్ ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యత ఎంతో అర్థం చేసుకోవచ్చని వివరించారు.

**ఆశీర్వదించండి**

ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో ప్రప్రథమంగా రాయగడ శాసనసభ నుంచి, అదేవిధంగా కొరాపుట్ లోక్‌సభ నుంచి మహిళలు పోటీ చేస్తున్నారు. దీంతో ప్రజల ఆశీర్వాదంతో తాము ముందుకు వెళ్లి అభివృద్ధికి కృషి చేస్తామని అనసూయా మాఝి, కౌసల్య హికకలు వేదికపై నుంచి అభ్యర్థించారు. కార్యకర్తల సహకారం ఉంటే తమ విజయం సునాయాసమవుతుందన్నారు. అందుకు అందరూ సహకరించాలని కోరారు.

**బీజేడీలో చేరికలు**

ఈ సందర్భంగా కాంగ్రెస్ యువ నాయకుడు, ప్రముఖ న్యాయవాది బాబు రాజ్‌గురు, అతని మద్దతుదారులు బీజేడీ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి నాయక్ వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జితు పూజారి, దయానిధి కొంధొపాణి, నందు మండంగి, విశ్వనాథ్ పిడిక, కృష్ణ సరక, శాంత గౌరి పూజారి వంటి కాంగ్రెస్ యువ నాయకులు బీజేడీలో చేరినవారిలో ఉన్నారు.

## మజ్జిగౌరి చైత్రోత్సవాలు ప్రారంభం



అమ్మవారి దర్శనం కోసం బారులుతీరిన భక్తులు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ట్రస్టు సభ్యులు

రాయగడ: కోర్కెలు తీర్చే కల్పవల్లి మజ్జిగౌరి అమ్మవారి వార్షిక చైత్రోత్సవ పూజలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. జంఝావతి నది నుంచి తీసుకొచ్చిన శుద్ధ జలాలతో అమ్మవారి సన్నిధిని శుద్ధి చేయడంతో పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. బరంపురం నుంచి ప్రత్యేకంగా రప్పించిన పురోహిత బృందం ఈ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఉదయం సూర్య, యజ్ఞశాల పూజలతో కార్యక్రమాలు మొదలయ్యాయి. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక, సభ్యులు ఇప్పిలి సన్యాసిరాజు, వి.శ్రీనివాస్‌రావు, పెద్దీన వాసు దంపతులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఐదు రోజుల పాటుగా జరిగే పూజల్లో ఉపావాసంతో నియమనిష్టలుగా పూజలు చేయనున్నారు. ఉదయం 11.41 గంటల నుంచి దేవతాపూజ, చండీ పఠణం, హారతి, పుష్పాంజలి, సాయంత్రం 4.25 గంటలకు హోమ గుండం, అగ్ని సంస్కార పూజలు జరిగాయి. ఇదిలాఉండగా చైత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారు భక్తులకు సునాబేసాలో దర్శనమిస్తుండడంతో భక్తులు బారులు తీరారు.

## విజృంభిస్తున్న మలేరియా వ్యాధి



పార్శలి గ్రామంలో వైద్య బృందం

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్, మునిగుడ సమితి పరిధి నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న డొంగిరియా గ్రామాల్లో మలేరియా విజృంభిస్తోంది. గత కొద్ది రోజులుగా ఈ ప్రాంత ప్రజలు జ్వరాల బారినపడి మంచం పట్టడంతో సమాచారం తెలుసుకున్న జిల్లా యంత్రాంగం ఈ మేరకు స్పందించింది. మలేరియా వ్యాధి సోకిన గ్రామాల్లో గురు, శుక్రవారాల్లో వైద్య బృందాలు ఆయా ప్రాంతాలకు వెళ్లి వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ రెండు సమితుల్లోని పార్శలి, లిఖాపాదొరొ, పాట్టంగపాదిరొ, డొంగామటి, జురప, లంబ, ఖాంబేసు, పాలొభెరి గ్రామాలకు వైద్య బృందాలు వెళ్లి చికిత్స అందిస్తున్నాయి. అదేవిధంగా రోగ నిర్ధారణ కోసం రక్త నమూనాలను సేకరిస్తున్నారు. అయితే కొంతమంది డొంగిరియా ప్రజలు కొండ ప్రాంతాల్లో నివసిస్తుండడంతో వారికి అందుబాటులో ఉన్న నాటువైద్యంపై ఆధారపడుతున్నట్లు తెలిసింది. అయితే అందరికీ సకాలంలో వైద్యం అందించే విషయంలో తగు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని వైద్య శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో పరిస్థితి అదుపులో ఉందని పేర్కొంది.

# బాల్య వివాహం నిలిపివేత



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

జయపురం: సమితి పరిధిలోని స్టేషన్ కొంగ గ్రామంలో జరుగుతున్న బాల్య వివాహాన్ని అధికారులు శుక్రవారం నిలిపివేశారు. చిల్డ్రన్ డవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి(సీడీపీవో) సుచేత పండ తెలిపిన వివరాల ప్రకారం కోట్‌పాడ్ సమితి కుసుమి ప్రాంతానికి చెందిన ఒక మైనర్ బాలికకు, స్టేషన్ కొంగ గ్రామంలోని పంకజ హరిజన్ అనే యువకుడికి వివాహం జరుగుతున్న సమాచారం అధికారులకు అందింది. దీంతో వెంటనే చైల్డ్‌లైన్ విభాగం అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్త, జయపురం సదర్ పోలీసుస్టేషన్ పోలీసులు అక్కడికి చేరుకొని పెళ్లి కుమార్తె వయస్సుపై కుటుంబ సభ్యులను ప్రశ్నించారు. సాధారణంగా ఆడపిల్ల వయస్సు 18 ఏళ్లు నిండిన తర్వాతనే పెళ్లి చేయాలని వారికి తెలియజెప్పారు. అలాగే పెళ్లి కుమారుడి వయస్సు పరిశీలించిన అధికారులు అతడికి 20 ఏళ్ల 7 నెలలు అయిందని తెలుసుకున్నారు. ఈ వయస్సు చట్టపరంగా వివాహానికి తగిన వయసు కాదని వారికి వివరించారు. దీంతో వివాహ వయస్సు వచ్చిన తర్వాతనే వివాహం చేస్తామని తల్లిదండ్రులు లిఖిత పూర్వకంగా తెలిపడంతో అధికారులు పలు సూచనలు చేశారు.

## 'రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ నిధులు దుర్వినియోగం'



మాట్లాడుతున్న ప్రదీప్ పాణిగ్రాహి

బరంపురం: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని బీజేపీ బరంపురం లోక్‌సభ అభ్యర్థి డా.ప్రదీప్ పాణిగ్రాహి ఆరోపించారు. స్థానిక పాత బస్టాండ్‌లోని నందన్ ఇంటర్నేషనల్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఒడిస్సా రాష్ట్ర అభివృద్ధికి విడుదల చేస్తున్న నిధులను అధికార పార్టీ బీజేడీ దారి మళ్లిస్తూ అవినీతికి పాల్పడుతోందని దుయ్యబట్టారు. రాష్ట్ర అభివృద్ధిపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక దృష్టి సారించి వివిధ రకాల పథకాల కింద కోట్లాది రూపాయలు విడుదల చేసినట్లు గుర్తు చేశారు. అధికార బీజేడీ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ప్రజలు ఇప్పటికే గ్రహించారని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వారికి బుద్ధి చెబుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుభాష్ పాఢి, ఎమ్మెల్యే అభ్యర్థి కె.అనిల్ కుమార్, సునీల్ సాహు తదితరులు పాల్గొన్నారు.

# ఓటే.. నీ ఆయుధం..!



రంగవల్లుల పోటీలో పాల్గొన్న విద్యార్థినులు




దేశ నిర్మాణంలో ఓటుహక్కు బలమైన అవకాశం నినాదంతో రంగవల్లి




ఓటు నవ భారత నిర్మాణానికి నాంది రంగవల్లి

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు వినియోగం ప్రక్రియ అత్యంత బృహత్తరమైనది. ఈ ప్రక్రియని విజయవంతం చేయడంలో యువతని భాగస్వాములుగా మేల్కొలిపేందుకు ఎన్నికల సంఘం అంకితభావంతో కృషి చేస్తోంది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) మార్గదర్శకంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాస్థాయిలో పలు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బాలాసోర్ జిల్లాలోని వివిధ కళాశాలల్లో విద్యార్థులు ఈ కార్యకలాపాల్లో చురుకుగా పాలుపంచుకున్నారు. ప్రధానంగా తొలిసారి ఓటు హక్కు పొందిన సరికొత్త విద్యార్థి ఓటర్లు ఈ కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని ఉత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఓటుహక్కు ప్రాధాన్యత ఇతివృత్తంగా బాలాసోర్ ప్రాంతంలో పలు పాఠశాలలు, కళాశాలల్లో ఇటువంటి చైతన్య కార్యక్రమాలు చేపట్టారు. మొదటిసారి ఓటు వేయనున్న యువతలో ఓటుహక్కు సద్వినియోగంపై అవగాహనను పెంపొందించే లక్ష్యంతో పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మన ప్రజాస్వామ్యం భవిష్యత్తును రూపొందించడంలో మన యువతను శక్తివంతం చేయడం చాలా కీలకం అని ఎన్నికల సంఘం తెలిపింది. డీఈవో బాలాసోర్ ఆధ్వర్యంలో తొలిసారిగా ఓటు వేయనున్న విద్యార్థులను అవగాహన కల్పించే దృక్పథంతో రంగోలీ పోటీలు నిర్వహించారు. వీరు రూపుదిద్దిన ప్రతి రంగవల్లి భారత ప్రజాస్వామ్య ప్రాముఖ్యతను ప్రతిబింబించిందని నిర్వాహక వర్గం అభినందించింది. – భువనేశ్వర్



యువత చైతన్య వారధులు

## క్లుప్తంగా

### ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న స్వతంత్ర అభ్యర్థి శిబశంకర్ దాస్

బరంపురం: నామినేషన్ల పర్వం మొదలవ్వడంతో ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు దూసుకుపోతున్నారు. బరంపురం నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మేయర్ శిబశంకర్ దాస్ తమ మద్దతుదారులతో వివిధ వార్డుల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మరో వైపు కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న దీపక్ పట్నాయక్ హుషారుగా ప్రచారం చేపట్టారు.

### ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ట

ఎచ్చెర్ల: లావేరు మండలం చెల్లయ్యమ్మ అగ్రహారం (కొత్తపేట)లో శుక్రవారం హనుమాన్ విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు మీసాల సీతంనాయుడు, మురపాక పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి పెయ్యిల లక్ష్మణరావు, చిన్నయ్యపేట సర్పంచ్ కళ్లెట్టి భాస్కరరావు, నాయకులు బాలి శ్రీనివాసనాయుడు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ధ్యానంపై శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులకు శుక్రవారం ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ మూమెంట్, శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో ట్రైనర్లు మాట్లాడుతూ ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో శిక్షకులు బింధుమాదవి, రామలక్ష్మి, ప్రిన్సిపాల్ రాంప్రసాద్, రామరాజు, ఎ.బాలరాజు పాల్గొన్నారు.

### సీతారాముల కల్యాణోత్సవానికి పందిరి రాట

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధిలో షిరిడీ సాయి బాబా ఆలయ ఆవరణలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఈ 22న జరగనుందని నిర్వాహకులు తెలిపారు. దీనిలో భాగంగా శుక్రవారం పందిరి రాట వేశారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### రైతుల పక్షపాతి నర్సింగరావు

గార: రైతుల కోసం నిత్యం పరితపించిన వ్యక్తి దివంగత ఎమ్మెల్సీ గొండు నర్సింగరావు అని గార ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. శుక్రవారం అంపోలులోని నర్సింగరావు ఘాట్ వద్ద తృతీయ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుమారులు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి దంపతులు, గొండు వాసుదేవరావు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పరామర్శ

ఎచ్చెర్ల క్యాంపస్: జలుమూరు వైఎస్సార్ సీపీ నాయకుడు సీరపు తిరుపతిరావు కంటి శస్త్ర చికిత్స చేయించుకోవడంతో శుక్రవారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరామర్శించారు. ఆయన వెంట ఎంపీటీసీ సీరపు శ్రీరామ్మూర్తి, నాయకులు గొలివి రామకృష్ణ ఉన్నారు.

### మద్యం పట్టివేత

ఎచ్చెర్ల: లావేరు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన దల్లి శంకర్ వద్ద రూ.19,200 విలువైన 68 మద్యం బాటిళ్ల టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. బుడుమూరు నుంచి లక్ష్మీపురం వెళ్లే రహదారిలో పట్టుకుని లావేరు పోలీసులకు అప్పగించారు. ఎస్సై స్వామినాయుడు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సంతోషిమాతకు పూజలు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో మూలవిరాట్టుకు నమక చమక సహిత పంచ సూక్తాలతో అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర శతనామాలతో కుంకుమ పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అమ్మవారిని సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించారు.

### ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. ఇంగ్లిష్ విభాగంలో శుక్రవారం సీనియర్ విద్యార్థుల ఫేర్‌వెల్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇంగ్లిష్ భాషపై పట్టు సాధిస్తే మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. రెక్టార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య మాట్లాడుతూ ఇంగ్లిష్ పీజీ పూర్తిచేసిన విద్యార్థులు నెట్, సెట్ వంటి అర్హతలు, డాక్టరేట్ వంటి ఉన్నత విద్యకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత పాల్గొన్నారు.

## సీతారాముల కల్యాణం చూతము రారండి..!

రాష్ట్రవ్యాప్తంగా రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువుగా శుక్రవారం నిర్వహించారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా జరిగిన కల్యాణోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



భువనేశ్వర్: లోకో కాలనీలో సీతారాముల కల్యాణోత్సవం



జయపురం: జమాల్ వీధిలో కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు



జయపురం: శ్రీరామ కల్యాణానికి పసుపు దంచుతున్న ముత్తైదువులు



జయపురం: శ్రీరామ కల్యాణ మహోత్సవంలో యువతుల కోలాటం

## దారుణం..!

- అరువు ఇవ్వలేదని గొడ్డలితో నరికి హత్య



బురుసు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

రాయగడ: తాగేందుకు వాటర్ బాటిల్ అరువు ఇవ్వలేదని ఆగ్రహించిన యువకుడు దుకాణదారుడిని గొడ్డలితో నరికి హత్య చేసిన ఉదంతం జిల్లాలోని కొలనార సమితి దొందిలి పంచాయతీలోని పాత్రపుట్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు, స్థానికులు తెలియజేసిన వివరాల ప్రకారం.. చందిలి పోలీసుస్టేషన్ పరిధి పాత్రపుట్ గ్రామంలో బురుసు పెద్దింటి (40) అనే వ్యక్తి తన ఇంటి వద్ద చిన్న కిరాణా దుకాణం నడుపుకుంటూ కుటుంబ పోషణ చేస్తుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం అదే గ్రామానికి చెందిన సుదేష్ తిరవాక అనే యువకుడు దుకాణానికి వెళ్లి వాటర్ బాటిల్ అరువు ఇమ్మన్నాడు. అయితే అందుకు దుకాణ యజమాని బురుసు అంగీకరించకపోవడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో అప్పటికే తప్పతాగి ఉన్న సుదేష్ కోపొద్రిక్తుడై దుకాణం వద్దనున్న ఒక గొడ్డలిని తీసుకుని బురుసును బెదిరించాడు. దీంతో అతను ప్రాణ భయంతో బయటకు పరుగులు తీశాడు. అతని వెనుక గొడ్డలితో వెంబడించిన సుదేష్ నాలుగు సార్లు వెనుక నుంచి నరికివేయడంతో తీవ్రగాయాలకు గురైన బురుసు కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని సుదేష్‌ను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మహానదిలో పడవ బోల్తా

- ఇద్దరు మృతి
- 7 మంది గల్లంతు

భువనేశ్వర్: ఝార్సుగుడ జిల్లా లఖన్‌పూర్ మండలం పరిధి శారద సమీపంలోని మహానదిలో శుక్రవారం పడవ బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, మరో 7 మంది గల్లంతయ్యారు. మృతి చెందిన కుటుంబాలకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శుక్రవారం పరిహారాన్ని ప్రకటించారు. ఈ దుర్ఘటనలో మృతి చెందిన ఇద్దరు వ్యక్తుల కుటుంబాలకు సానుభూతి తెలిపిన ముఖ్యమంత్రి, బాధిత కుటుంబానికి రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రయాణికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గాయపడినవారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించిన ముఖ్యమంత్రి సమన్వయంతో గాలింపు, సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి, ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ)ని ఆదేశించారు. ఝార్సుగుడ ఆర్డీసీ, జిల్లా కలెక్టర్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 5 మంది స్కూబా డైవర్లు, రెండు సెర్చ్ కెమెరాలను గాలింపు చర్యలు చేపట్టేందుకు ఘటనా స్థలానికి తరలించారు. 50 మంది ప్రయాణికులతో ఛత్తీస్‌గఢ్ నుంచి బర్‌గఢ్ జిల్లా అంబొబొణొ మండలం పాథొరాసేణి ప్రాంతానికి బయల్దేరిన పడవ హిరాకుద్ జలాశయం చేరువలో ఈ ఘటన జరిగింది. రెంగాలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శారదా ఘాట్ వద్దకు చేరే సమయంలో బోటు బోల్తా పడింది. స్థానిక మత్స్యకారులు 35 మంది ప్రయాణికులను రక్షించి తీరానికి చేర్చారు. మరో ఇద్దరు ప్రయాణికులు శవమై తేలినట్లు గుర్తించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. వారు ఏడుగురు ప్రయాణికులను రక్షించారు. మరో 7 మంది ప్రయాణికులు గల్లంతయ్యారు.

## వంతెన నిర్మించాలని వినతి



బీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సింగారి పంచాయతీ పరిధి కంగొసిరి గ్రామస్తుల సౌకర్యార్థం నాగావళి నదిపై వంతెన ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు బీడీవో మానసీ దాస్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఇదే విషయమై పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు గ్రామస్తులు మొర పెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో గ్రామస్తులంతా ఏకమై నదిపై రాకపోకలు కొనసాగేవిధంగా తాత్కాలికంగా కర్ర వంతెనను స్వయంగా నిర్మించుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ కర్ర వంతెన తాత్కాలికమే కావడంతో నదిపై వంతెన నిర్మించాలని మరోసారి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికారులు, నాయకులు ఎంతవరకు స్పందిస్తారో వేచి చూడాల్సిందే. వంతెన నిర్మించకపోతే ఎన్నికలు బహిష్కరిస్తామని గ్రామస్తులు ఇప్పటికే హెచ్చరించారు.

## బీజేపీలోకి వలసలు

పర్లాకిమిడి: గుసాని సమితి ఉప్పలాడ పంచాయతీ ప్రాంతీయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బల్ల ధనుంజయ బీజేపీలో శుక్రవారం చేరారు. దీంతో గుసాని సమితి లావణ్యగడ నుంచి పర్లాకిమిడి బీజేపీ కార్యాలయం వరకు ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావుతో పాటు బల్ల ధనుంజయ, రొక్కం రాంప్రసాద్(జ్యోతి)లతో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో గుసాని, కాశీనగర్ బీజేపీ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కోడూరు, ధనుంజయ, రాంప్రసాద్ తదితరులు

## ఈఈఎం సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రికా గార్గ్

పర్లాకిమిడి: గజపతి కలెక్టరేట్ కార్యాలయంలో భారత ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఎన్నికల ఖర్చు నియంత్రణ పర్యవేక్షణ కమిటీ(ఈఈఎం) సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో చండీఘడ్ నుంచి ఐఆర్ఏఎస్ అధ్యక్షురాలు చంద్రికా గర్గ్, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గుణనిధి నాయక్, అదనపు ఎన్నికల అధికారి పృథ్వీరాజ్ మండల్, డిప్యూటీ కలెక్టర్ సుస్మితా మఝి, బరంపురం, మోహనా, పర్లాకిమిడి ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై అధికార యంత్రాంగం ఒక పర్యవేక్షణ కమిటీ నియమించింది. ఈఈఎం బృందం సభ్యులు ఫ్లయింగ్ స్క్వాడ్, బీడీవో సర్వలెన్సు టీమ్, వీడియోగ్రఫీ బృందం, ఎంసీఎంసీ బృందం తదితరులు ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఖర్చును అంచనా వేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఎండలు అధికంగా ఉండటంతో జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.

## అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా పట్టివేత

కాశీబుగ్గ: భువనేశ్వర్–విశాఖపట్నం ఇంటర్‌సిటీ రైలులో బీహార్ రాష్ట్రానికి చెందిన ఐదుగురు అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా సభ్యులను జీఆర్పీ పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల తనిఖీల్లో భాగంగా పోలీసులు పలాస రైల్వే స్టేషన్‌లోని ఇంటర్‌సిటీ రైలులో తనిఖీ చేస్తుండగా రంజిత్‌కుమార్ సాహూ, నిశాంత్ కుమార్ మండల్, జైలో మండల్, ఉదయ్ కుమార్ మండల్, అన్సకుమార్ యాదవ్ అనే వారు పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో క్రైమ్ టీం చాకచక్యంగా వారిని పట్టుకుని పలాస జీఆర్పీ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అనంతరం ఎస్ఐ షేక్ షరీఫ్ విచారణ జరిపి వారిపై కేసు నమోదు చేశారు. విచారణలో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. వీరు బీహార్‌కు చెందిన దొంగల ముఠా సభ్యులని తెలిసింది. ఇది వరకు రెండు కేసుల్లో 27 గ్రాముల బంగారం, 5 తులాల వెండి(రూ.99 వేలు) స్వాధీనం చేసుకొని విశాఖపట్నం రైల్వే కోర్టులో హాజరుపరిచినున్నారు. నెల రోజుల కిందట కూడా వీరి వద్ద నుంచి 50 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. వీరు ఎక్కువగా రైళ్లలో బ్యాగులను ఎత్తుకెళ్లడం, జిప్‌లు తీసి సామాన్లు దోచుకెళ్లడం చేస్తుంటారు. బబ్లు, దబ్బా అనే రెండు బీహార్ అంతర్‌రాష్ట్ర ముఠాలకు చెందిన వీరిని పట్టుకోవడంపై ఉన్నతాధికారులు అభినందించారు. నెల రోజుల వ్యవధిలో ఇలాంటి గ్యాంగుల వద్ద నుంచి పలాస జీఆర్పీ సిబ్బంది రూ.3,39,000 విలువ కలిగిన బంగారం స్వాధీనం చేసుకున్నారు.

## బైక్ పైనుంచి జారిపడి మహిళ మృతి

నందిగాం: మండలంలోని పెంటూరుకు చెందిన కూర్మాపు సరోజిని(48) బైక్ పైనుంచి జారిపడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరోజిని కుమారుడు రమేష్‌కు ఈ నెల 24న వివాహం నిశ్చయించారు. కుమారుడితో కలిసి పెళ్లి సామగ్రి కొని తిరిగి వస్తుండగా కొత్తగ్రహారం వద్ద బైక్‌పై వెనుక కూర్చున్న సరోజిని ఒక్కసారిగా జారిపడింది. తలకు బలమైన గాయం కావడంతో టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా కొద్దిసేపటికే మృతి చెందింది. ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 14 మందిపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలో గురువారం జరిగిన కొట్లాట కేసుకు సంబంధించి ఇరువర్గాలకు చెందిన 14 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఒకవర్గంలో కొత్తకోట వేణుగోపాలరావు మరో తొమ్మిది మందిపై, మరో వర్గంలో కూన కిరణ్‌కుమార్ మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చిరంజీవి తెలిపారు.

## ఓటింగ్ శాతం పెంపునకు 'స్వీప్'



దివ్యాంగులకు అవగాహన కల్పిస్తున్న ఎన్నికల అధికారులు



ఎన్నికల యంత్రాల పనితీరుపై వర్క్‌షాపు

పర్లాకిమిడి: ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపునకు జిల్లా యంత్రాంగానికి ఎన్నికల కమిషన్ బాధ్యాయుతమైన కార్యక్రమం అప్పగించింది. దీనిలో భాగంగా 'స్వీప్' అనే కార్యక్రమం చేపట్టి స్థానిక కలెక్టరేట్ వద్ద గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంలో వీవీ ప్యాట్‌లు, ఈవీఎంల పనితీరుపై దివ్యాంగులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఎం రాజేంద్ర మింజ్, డీఆర్‌డీఏ అధికారి డా.గుణనిధి నాయక్‌లు పాల్గొన్నారు. అలాగే నూతన ఓటర్లు, దివ్యాంగులు, గ్రామీణ ప్రజలు, నిరక్షరాస్యులు, పట్టణ ప్రాంత ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా సామాజిక సురక్ష అధికారి సంతోష్ కుమార్ నాయక్, జిల్లా శిశు సురక్ష అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, జిల్లా మిషన్ శక్తి కో–ఆర్డినేటర్ టిమాస్ బోరా, సీసీడీ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి అడ్డాల జగన్నాథ రాజు, సమర్థ్ దివ్యాంగుల సంస్థ కార్యదర్శి సంతోష్‌కుమార్ మహారాణా పాల్గొన్నారు.

## అద్భుతం.. ఆదిత్యుని పరిణయం

- రుగ్వేద పూర్వకంగా సూర్యనారాయణ స్వామి కల్యాణం
- పట్టువస్త్రాలను సమర్పించిన డిప్యూటీ కమిషనర్ దంపతులు



పట్టువస్త్రాలను సమర్పిస్తున్న ఈవో చంద్రశేఖర్ దంపతులు



తిరువీధి సేవలో ఈవో చంద్రశేఖర్, ప్రధానార్చకులు శంకరశర్మ తదితరులు

అరసవల్లి: సర్వలోకాలకు వెలుగులు పంచే ప్రత్యక్ష దైవం సూర్యనారాయణ స్వామి ఉషా, పద్మిని, ఛాయా దేవేరుల కళ్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి అంగరంగవైభవంగా జరిగింది. క్రోధి నామ సంవత్సర చైత్ర శుద్ధ ఏకాదశి శుక్రవారం రాత్రి 9 గంటల సుమూహూర్తాన అనివెట్టి మండపం వేదికగా ఆదిత్యుని కల్యాణమూర్తులుగా భక్తులకు దర్శనమిస్తూ ఆశీర్వదించారు. వందలాది మంది భక్తులు రూ.500 చెల్లించి సతీసమేతంగా పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో అర్చకబృందం, వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ సాగిన ఈ కల్యాణోత్సవానికి ఆలయ ఈవో, డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్, ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముందుగా ఈవో/డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్, అరుణ దంపతులు స్వామివారికి సంప్రదాయ పట్టువస్త్రాలను సమర్పించారు. ఉత్సవమూర్తులను 11 రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి కల్యాణ తంతు రుగ్వేదం ప్రకారం ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణ సేవలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు, స్వామి వారి శేషవస్త్రాలు అందజేశారు.

### గజ, హనుమ వాహనాలపై ఊరేగుతూ...

కల్యాణానికి ముందు సాయంత్రం 7.30 గంటల సమయంలో ఆదిత్యున్ని హనుమ వాహనంపైన, ముగ్గురు దేవేరులను గజవాహనంపై మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు. ఈవో చంద్రశేఖర్ స్వయంగా ఊరేగింపు వాహనాన్ని మోస్తూ ముందుకు సాగారు. దారి పొడవునా భక్తులు ఉత్సవ మూర్తులకు హారతినిచ్చారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు ద్వారపు అనురాధ, ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు ఇప్పిలి నగేష్ కాశ్యప శర్మ, సాందీప్ శర్మ, రంజిత్ శర్మ, ఫణీంద్ర శర్మ, క్షేమేంద్ర శర్మ, షణ్ముఖ శర్మ, నేతేటి హరి ప్రసాద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న భక్తులు

## భక్తిశ్రద్ధలతో సీతారాముల రథోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో కోదండ రామాలయంలో జరుగుతున్న శ్రీరామచంద్ర స్వామి వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా శుక్రవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు శేషాచార్యులు ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులను రథంపై ఉంచి ఊరేగించారు. కార్యక్రమంలో ఈఓ గురునాధరావు, భక్తబృందం పాల్గొన్నారు.



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

### ఘనంగా సీతారాముల కల్యాణం

ఎచ్చెర్ల: మండలంలోని కేశవరావుపేటలో సీతారాముల కల్యాణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆలయం ఆవరణలో కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

## ఓటింగ్ శాతం మరింత పెరగాలి



కళాశాల మైదానంలో ఓటేద్దాం రూపంలో కూర్చున్న విద్యార్థులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని ఓటింగ్ శాతం పెంచాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలిలో ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, జిల్లా అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అందరి చేతిలో ఆయుధం ఓటు అని, 18 ఏళ్లు నిండి ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ పోలింగ్ నాడు ఓటు వేయాలన్నారు. 2019 ఎన్నికల కన్నా ఓటింగ్ శాతం మరింత పెరగాలన్నారు ప్రతి ఒక్కరిలో ఓటు హక్కుపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ స్వీప్ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, డీఈఓ వెంకటేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కవిత, నెహ్రూ యువ కేంద్రం కో–ఆర్డినేటర్ ఉజ్వల్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిని గడ్డమ్మ, ముఖ్య ప్రణాళిక అధికారిని ప్రసన్నలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ గణపతిరావు, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అంబేడ్కర్ యూనివర్సిటీ, వెంకటేశ్వర, శివాని ఇంజినీరింగ్ కళాశాలలు, ఆదిత్య, ప్రతిభ, సన్ డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ పురుషుల కళాశాల, మహిళా కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మీడియా కేంద్రాన్ని పరిశీలించిన వ్యయ పరిశీలక బృందం

విజయనగరం అర్బన్: ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా కేంద్రాన్ని వ్యయ పరిశీలకులు ప్రభాకర్ ప్రకాష్ రాజన్, ఆనంద్ కుమార్, ఆకాష్ దీప్ శుక్రవారం కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. మీడియా మానిటరింగ్, మోడల్ కోడ్ కమిటీ, సోషల్ మీడియా, జిల్లా వ్యయ అంచనాల కమిటీ, ఫిర్యాదులు, రిపోర్టింగ్ విభాగాలను పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వారి విధుల గురించి అడిగి, రిజిస్టర్లను పరిశీలించారు. వాహనాల జీపీఎస్ సిస్టంను, మద్యం చెక్ పోస్టుల కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను తనిఖీ చేశారు. అనంతరం మీడియా కేంద్రాన్ని సందర్శించారు.

### యువకుడి ఆత్మహత్య


మృతుడు విజయ్‌కుమార్

బాడంగి: మూడేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్న ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఆనవరం గ్రామానికి చెందిన తూముల విజయ్‌కుమార్(23) గురువారం పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మూడేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతూ పార్వతీపురం ఆస్పత్రిలో చికిత్స పొందినా నయం కాకపోవడంతో నొప్పి తట్టుకోలేక విసిగిపోయి జీవితంపై విరక్తితో గ్రామానికి సమీపంలో గల అరటి తోట వద్ద పురుగు మందు సేవించాడు. విషయం తెలుసుకున్న మృతుడి సోదరుడు, స్నేహితుడు 108లో బొబ్బిలి ఆస్పత్రిలో చేర్పించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం విజయనగరం రిఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తండ్రి తూముల కృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఆర్.జయంతి పర్యవేక్షణలో హెచ్‌సీ ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

### బీరు బాటిళ్ల పట్టివేత


పట్టుబడిన మద్యం సీసాలతో ఎస్‌ఐ, పట్టుబడిన వ్యక్తి

వేపాడ: మండల కేంద్రమైన వేపాడ జంక్షన్ వద్ద వల్లంపూడి పోలీసులు నిర్వహించిన దాడుల్లో 12 బీరు సీసాలు పట్టుబడినట్లు వల్లంపూడి ఎస్.ఐ రాజేష్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన దాడుల్లో జంక్షన్‌లో తనిఖీ నిర్వహిస్తుండగా 12 బీరు సీసాలు పట్టుబడటంతో సీసాలతో పాటు వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం సీసాలు రవాణా చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు.

### ఆటో ఢీకొని యువకునికి గాయాలు


గాయపడ్డ దిలీప్

బొబ్బిలి: మండలంలోని రంగరాయపురానికి చెందిన రాజాన దిలీప్ ఫ్లిప్‌కార్ట్ ఆన్‌లైన్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. అదే పనిపై పట్టణంలోని శ్రీకళాభారతి వెనుక గల రాతిపనివారి వీధి వెళ్లి డెలివరీ అనంతరం తిరిగి వస్తుండగా మెయిన్‌రోడ్డు మీదుగా తెర్లాం మండలం కూనాయవలసకు చెందిన మోది సింహాచలం నడుపుతున్న ఆటో ఢీకొనడంతో దిలీప్ గాయపడ్డాడు. వెంటనే దిలీప్‌ను స్థానిక సీహెచ్‌సీకి తరలించగా మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించినట్టు ఏఎస్సై జి.భాస్కరరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### 144 మద్యం బాటిళ్ల స్వాధీనం

విజయనగరం క్రైమ్: విజయనగరం మండల పరిధి బియ్యాలపేట గ్రామ శివార్లలో అక్రమంగా తరలిస్తున్న 144 మద్యం బాటిళ్లను, ఒక బైక్‌ను రూరల్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ వాసుదేవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### జూదరుల అరెస్టు

విజయనగరం క్రైమ్: వన్‌టౌన్ పరిధిలో పద్మావతీనగర్ గాయత్రీ లేఅవుట్‌లో పేకాట ఆడుతున్న 11 మందిని టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ సాగర్‌బాబు, వన్‌టౌన్ ఎస్‌ఐ హరిబాబు నాయుడుల ఆధ్వర్యంలో శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 11 మొబైల్స్‌తో పాటూ రూ.50వేల 800ల నగదు స్వాధీనం చేసుకున్నారు.

### చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹130 | ₹230 | ₹240 |

# ఉపాధి భేష్

| 2019 నుంచి 2024 మార్చి నెలాఖరు నాటికి కల్పించిన పని దినాలు | |
|---|---|
| సంవత్సరం | పని దినాలు |
| 2019-20 | 2.58 కోట్లు |
| 2020-21 | 3.06 కోట్లు |
| 2021-22 | 2.55 కోట్లు |
| 2022-23 | 1.95 కోట్లు |
| 2023-24 | 2.18 కోట్లు |

| సంవత్సరం | వేతనదారులకు చెల్లించింది |
|---|---|
| 2019-20 | రూ.563.18 కోట్లు |
| 2020-21 | రూ.731.85 కోట్లు |
| 2021-22 | రూ.527.78 కోట్లు |
| 2022-23 | రూ.406.55 కోట్లు |
| 2023-24 | రూ.502.77 కోట్లు |

| సంవత్సరం | మెటీరియల్ పనులకు వెచ్చించిన నిధులు |
|---|---|
| 2019-20 | రూ.62.12 కోట్లు |
| 2020-21 | రూ.312.70 కోట్లు |
| 2021-22 | రూ.198.00 కోట్లు |
| 2022-23 | రూ.114. 61 కోట్లు |
| 2023-24 | రూ.129.05 కోట్లు |

- ఐదేళ్లలో 12.32 కోట్ల పనిదినాలు
- వేతనాల కోసం వెచ్చించిన నిధులు రూ.2732.13 కోట్లు
- మెటీరియల్ నిమిత్తం ఖర్చు చేసింది రూ.816.48 కోట్లు
- ఒక్కో కుటుంబానికి రూ.25 వేల నుంచి రూ.27 వేల వరకు లబ్ధి
- జిల్లాలో జాబ్ కార్డులు 3.45లక్షలు
- వేతనదారులు 6.06 లక్షలు


గంట్యాడ మండలం పెదవేమలి గ్రామంలో పని చేస్తున్న వేతనదారులు

విజయనగరం ఫోర్ట్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వేతనదారులకు కోట్లాది పనిదినాలు కల్పించింది. ఫలితంగా జిల్లాలో వలసలు గణనీయంగా తగ్గాయి. ఐదేళ్ల కాలంలో ప్రతి గ్రామంలోను పెద్ద ఎత్తున పనులు కల్పించారు. గతంలో ఉపాధి లేక గ్రామాల్లో కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం సొంతూళ్లలో పని కల్పించింది. దీంతో అధిక సంఖ్యలో వేతనదారులు పనులకు వెళ్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వేతనాల చెల్లింపు కూడా సత్వరమే చెల్లిస్తున్నారు. దేశంలోనే విజయనగరం జిల్లా పని కల్పనలో ప్రథమంగా నిలిచింది. ప్రతి కుటుంబానికి 100 రోజులు పాటు ఈ పథకం ద్వారా పని కల్పిస్తారు. ఉన్న ఊళ్లలోనే పని దొరుకుతుంది. సాఫీగా జీవనం సాగిస్తున్నారు.

#### రూ.25వేల వరకు లబ్ధి



నాది గంట్యాడ మండలం పెదవేమలి గ్రామం. ప్రతి ఏటా ఉపాధి పనికి వెళ్తున్నాను. ఈ ఏడాది నాకు రూ. 25 వేలు వరకు లబ్ధి చేకూరింది. మా గ్రామంలోనే పని పెట్టడం వల్ల పనికి వెళ్తున్నాను. వేతనదారులకు పని కల్పించడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపడం ఆనందంగా ఉంది. నాతో పాటు వందలాది మంది మా గ్రామంలో పనికి వస్తున్నారు.

– గాదల కృష్ణమ్మ, వేతనదారు, పెదవేమలి గ్రామం

#### వలసలు తగ్గాయి



నాది చీపురుపల్లి మండలం. ఉపాధి హామీ పథకం రాకముందు చాలా మంది హైదరాబాద్ విశాఖపట్నంకు పని కోసం వెళ్లేవారు. ఉపాధి పథకం వచ్చిన తర్వాత మా గ్రామంలోనే పని దొరుకుతుంది. డబ్బులు కూడా ప్రభుత్వం పని చేసిన వెంటనే జమ చేస్తుంది. దీంతో డబ్బులకు ఇబ్బంది లేదు. కుటుంబం అంతా సాఫీగా జీవనం సాగిస్తున్నాం.

– బనాన లక్ష్మి, వేతనదారు, చీపురుపల్లి మండలం

#### జిల్లాలో జాబ్ కార్డులు 3.45 లక్షలు

జిల్లాలో జాబ్ కార్డులు 3.45లక్షలు ఉన్నాయి. వీటిలో 3.21లక్షల జాబ్ కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. వీటి పరిధిలో 6.06 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. వీరిలో 5.04 లక్షల మంది వేతనదారులు పనులకు వెళ్తున్నారు.

#### ఒక్కో వేతనదారుడికి రూ.25 వేల వరకు లబ్ధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనికి వెళ్లే వేతనదారుడికి వేలాది రుపాయిలు ఏటా అందుతున్నాయి. ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.25 వేల నుంచి రూ. 30 వేల వరకు లబ్ధి చేకూరుతుంది. ప్రతి ఏటా ప్రభుత్వం కోట్లాది పనిదినాలు వేతనదారులకు కల్పిస్తోంది. ఏడాదికి 2 కోట్ల నుంచి 3 కోట్ల వరకు పనిదినాలు కల్పిస్తున్నారు. ఇందుకోసం రూ.500 నుంచి రూ.700 కోట్ల వరకు వేతనదారులకు ఏటా చెల్లిస్తున్నారు.

#### ఐదేళ్లలో 12.32 కోట్ల పనిదినాలు

2019 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 12.32 కోట్ల పనిదినాలు ప్రభుత్వం కల్పించింది. పనికి వచ్చిన వేతనదారులకు ఇప్పటి వరకు రూ.2732.13 కోట్లు వెచ్చించింది. మెటీరియల్ పనులకు సంబంధించి రూ.816.48 కోట్లు ఖర్చు చేసింది.

#### వేతనదారులకు గిట్టుబాటు వేతనం

ఉపాధి హామీ పథకంలో భాగంగా పనికి వచ్చే ప్రతి వేతనదారుడికి ప్రభుత్వం కనీస వేతనం వచ్చే విధంగా చర్యలు చేపట్టింది. గరిష్ఠ వేతనం రూ.272 కాగా వేతనదారులకు రూ.240 నుంచి రూ.272 వరకు వేతనం వచ్చే విధంగా చర్యలు తీసుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వేతనం రూ.300కు ప్రభుత్వం పెంచింది. వేతనాలు కూడా వారం రోజుల్లో జరుగుతుండడంతో వేతనదారులు ఉత్సాహంగా పనులకు వెళ్తున్నారు.

# మరణ రేటు జీరో




పార్వతీపురం గిరిజన సంక్షేమ వసతిగృహంలో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

| ఐదేళ్లలో జిల్లాలో మలేరియా కేసుల వివరాలు | | | |
|---|---|---|---|
| సంవత్సరం | రక్త పరీక్షలు | మలేరియా నిర్ధారణ | మరణాలు కేసులు |
| 2019 | 280725 | 150 | 0 |
| 2020 | 186275 | 124 | 0 |
| 2021 | 259207 | 109 | 0 |
| 2022 | 263417 | 502 | 0 |
| 2023 | 264449 | 482 | 0 |
| 2024 (మార్చి వరకు) | 72902 | 130 | 0 |

- ఫలించిన రాష్ట్రప్రభుత్వం చర్యలు
- విస్తృతంగా వైద్యారోగ్య కార్యక్రమాలు
- ఏటా రెండు విడతల్లో దోమల నివారణ మందు పిచికారీ
- పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- 410 మలేరియా పీడిత గ్రామాల గుర్తింపు క్రమం తప్పకుండా దోమతెరల పంపిణీ

పార్వతీపురంటౌన్: గతంలో గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ, పారిశుద్ధ్య కార్యక్రమాలు అంతంతమాత్రంగానే ఉండేవి. గిరిజనుల ప్రాణాలంటే గతంలో పాలకులకు లెక్క ఉండేది కాదు. 2012 నుంచి 2018 వరకు జిల్లాలో మలేరియా తీవ్రత అధికంగా ఉంది. మరణాలు కూడా ఎక్కువగా నమోదయ్యేవి. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత గిరిజన ప్రాంతాల్లో జీవించే ప్రతి ఒక్కరికి ఆరోగ్య భరోసా కలిగింది. సీజనల్ వ్యాధుల నివారణే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి వైద్యారోగ్య కార్యక్రమాలను విస్తృతం చేశారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి 50 కుటుంబాలకు గ్రామ వలంటీర్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రభుత్వ యంత్రాగం పలు చర్యలు చేపట్టింది. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతం చేసింది. మరోవైపు దోమల నివారణకు మలేరియా, వైద్యారోరోగ్యశాఖ బృందాలు నిరంతరం పనిచేశాయి.

#### జిల్లావ్యాప్తంగా 4,42,400 దోమతెరలు

2022లో జిల్లావ్యాప్తంగా 4,42,400 దోమతెరలను ప్రభుత్వం పంపిణీ చేసింది. దోమతెరల వినియోగంపై వైద్యబృందాలు, సచివాలయ ఉద్యోగులు గిరిజనులకు అవగాహన కల్పించారు. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు వ్యాధుల సీజన్‌గా ప్రభుత్వం గుర్తించి వైద్యారోగ్య కార్యక్రమాలను చేపడుతోంది. 2019 నుంచి నుంచి దోమల నివారణతో పాటు మలేరియా తీవ్రతను అరికట్టడంలో మలేరియా, వైద్యారోరోగ్యశాఖలు ఎంతో శ్రమించాయి. ప్రతి ఏడాది రెండు దఫాలుగా దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నాయి. ప్రతి గ్రామంలో ఇంటి లోపల, బయట దోమల మందు పిచికారీని తప్పనిసరిగా చేయించాలనే నిబంధనను సచివాలయ ఉద్యోగులు అమలు చేశారు. గ్రామ వలంటీర్లు తమకు నిర్దేశించిన గిరిజన కుటుంబాల నివాసాల వద్ద దగ్గరుండి దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఇంటింటా ఫీవర్ సర్వే విజయవంతంగా నిర్వహించారు. చిన్నపాటి జ్వరం వచ్చినా వైద్యసిబ్బంది వెంటనే రక్త పరీక్షలు చేసేవారు. మలేరియా, ఇతర జ్వరాలను నిర్ధారించి సకాలంలో వైద్యసేవలు అందించడంతో జ్వరపీడితులు కోలుకున్నా రు. ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలించడంతో మలేరియా వ్యాధి బారిన పడి ఎవరూ మృతి చెందలేదు.

#### 401 మలేరియా పీడిత గ్రామాలను గుర్తించాం



జిల్లా వ్యాప్తంగా 401 మలేరియా పీడిత గ్రామాలను గుర్తించాం. గ్రామాల్లో మలేరియా కేసులు నమోదైనా అక్కడ కూడా వైద్యబృందాలను అప్రమత్తం చేస్తున్నాం. దోమల నివారణ చర్యలతో పాటు సంపూర్ణ పారిశుద్ధ్యానికి డ్రైడే నిర్వహిస్తున్నాం. మలేరియా కేసులు నమోదవుతునప్పటికీ సకాలంలో వైద్యసేవలు అందించడంతో ఈ ఐదేళ్లలో ఆ వ్యాధితో మరణాలు నమోదు కాలేదు.

– డాక్టర్ టి. జగన్మోహన్ రావు, డీఎంఓ, పార్వతీపురం మన్యం


దోకిశీలలో డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్న సిబ్బంది

#### 'మే 15 నుంచి దోమల నివారణ మందు పిచికారీ

ఈఏడాది కూడా దోమల నిర్మూలన కార్యక్రమాలకు మలేరియా, వైద్య ఆరోగ్యశాఖలు చర్యలు చేపట్టాయి. ఎన్నికల కోడ్ రాకముందే రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో మలేరియా నివారణకు చేపట్టాల్సిన చర్యలను నిర్దేశించింది. ఈ మేరకు జిల్లాలో 401 మలేరియా పీడిత గ్రామాలను గుర్తించి మే 15 నుంచి మొదట విడత దోమల నివారణ మందు పిచికారీని జిల్లా మలేరియాశాఖ ప్రారంభించనుంది.

### మునకలవలస సచివాలయంలో ఉద్యోగుల మధ్య వివాదం


మునకలవలస సచివాలయంలో ధ్వంసమైన కుర్చీలు

రేగిడి : మండలంలోని మునకలవలస గ్రామ సచివాలయ ఉద్యోగుల మధ్య శుక్రవారం వివాదం నెలకొంది. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ కె.సత్యనారాయణ తనకు జీతం బిల్లును పంచాయతీ కార్యదర్శి పి.సుధీర్‌కుమార్ పెట్టకపోవడంపై వీరిద్దరి మధ్య వివాదం తలెత్తినట్లు గ్రామస్తులు వెల్లడించారు. సచివాలయంలో వీరిద్దరు పరస్పరం వాదోపవాదనలు చేసుకుని, చివరికి సచివాలయంలో ఫర్నిచర్‌ను ధ్వంసం చేసినట్లు తెలిపారు. గతంలో వీరిద్దరి మధ్య వ్యక్తిగత విభేదాలు కూడా ఉన్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించి, పంచాయతీ కార్యదర్శితో పాటు డిజిటల్ అసిస్టెంట్ వద్ద స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. గ్రామస్తులతో పాటు మండల పరిషత్ అధికారులు వద్ద ఈ వివాదానికి సంబంధించి వివరాలు ఆరా తీస్తున్నారు.

### పిచ్చి కుక్క స్వైర విహారం

- తొమ్మిది మందికి తీవ్ర గాయాలు

బొండపల్లి: మండల కేంద్రమైన బొండపల్లి గ్రామంలో పిచ్చి కుక్క స్వైర విహారం చేసి తొమ్మిది మందిని కరిచి తీవ్రంగా గాయపరిచింది. గ్రామంలోని యాత వీధిలో ఆరు బయట ఉన్న వారిపై కుక్క విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచింది. స్థానికులు వెంటబెట్టగా అక్కడ నుంచి జాతీయ రహదారికి ఆనుకోని ఉన్న టీ పాయింట్‌కు సమీపంలో మరి కొంత మందిపై దాడి చేసింది. అక్కడ నుంచి జాతీయ రహదారి పక్కన తాటి ముంజెలు విక్రయిస్తున్న వారితో పాటు, రోడ్డు పక్కన లారీని ఆపి ఉంచిన డ్రైవర్‌పై కూడా దాడి చేసింది. ఈ ఘటనల్లో గ్రామానికి చెందిన పి.అచ్చియ్యమ్మ, బి.కృష్ణమ్మ, బి.సంతోష్ , కె.సురేష్, పి.రామలక్ష్మి, వై.సన్యాసిలకు తీవ్ర గాయాలు కాగా, బొండపల్లిలోని పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. బొండపల్లి పీహెచ్‌సీలో నీలాతి రాము, పురం రామలక్ష్మి, ఎర్ర సన్యాసిలు చికిత్స పొందుతున్నారు.

### వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


బెల్లాన శంకరరావు

వంగర: మండల కేంద్రానికి చెందిన బెల్లాన శంకరరావు అదృశ్యమైనట్లు కేసు నమోదు అయిందని హెడ్‌కానిస్టేబుల్ రాములు శుక్రవారం తెలిపారు. ఈ నెల 11వ తేదీన శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రికి వెళ్తానని చెప్పి, వెళ్లిన వ్యక్తి ఇంతవరకు ఇంటికి తిరిగి రాలేదని ఆయన భార్య బెల్లాన జగదాంబ పోలీసులకు ఫిర్యాదు చేసిందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### జాగ్రత్తలు తప్పనిసరి

విజయనగరం క్రైమ్: అగ్ని ప్రమాదాల సమయంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించడంతో పాటు సమయస్ఫూర్తిగా వ్యవహరించాలని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి సోమేశ్వరరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఫైర్ సేఫ్టీ అధికారులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### 22 నుంచి ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం


ముత్యాలమ్మ తల్లి

విజయనగరం రూరల్: కార్పొరేషన్ పరిధిలోని గాజులరేగ గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయ 71వ వార్షికోత్సవాలను ఈ నెల 22 నుంచి నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న తొలేళ్లు, 23న అమ్మవారి పండుగ, 24న అనుపోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారి తీర్థ,ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

# తాగునీటి కష్టాలకు చెక్..

- వేసవిలో తాగునీటి సరఫరాకు చర్యలు
- వర్షాకాలంతో సమానంగా రోజు విడిచి రోజు నీరు
- మూడు పంప్‌హౌస్‌ల నుంచి ప్రతిరోజూ 27 మిలియన్ లీటర్ల నీరు పంపింగ్
- ఆంధ్ర రిజర్వాయర్ నుంచి చంపావతిలోకి నీరు మళ్లింపు
- 2019 ఎన్నికలకు ముందు ఐదు రోజులకొకసారి నీటి సరఫరా
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల చొరవతో పుష్కలంగా తాగునీరు


కుళాయి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి (ఫైల్)

విజయనగరం: వేసవి వచ్చేసింది.. సూర్యభగవానుని ప్రచండ రూపం ప్రారంభమైంది. భూగర్భ జలాలు క్రమ క్రమంగా అడుగంటుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా కార్పొరేషన్ యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ముందుస్తు ఆలోచనలతో మూడు లక్షలకు పైగా జనాభా కలిగిన విజయనగర నగర ప్రజలకు రానున్న మూడు నెలలు వర్షాకాలంతో సమానంగా మండు వేసవిలో సైతం రోజు విడిచి రోజు నీటి సరఫరా చేసేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించింది. 2019 ఎన్నికలకు ముందు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా నగర ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడిన విషయం విధితమే. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటోంది. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో సాధారణ రోజుల్లోగానే వేసవిలో కూడా రోజు విడిచి రోజు కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు.

#### రోజు విడిచి రోజు నీటి సరఫరాకు చర్యలు..

మండు వేసవిలో నగర ప్రజలకు రోజు విడిచి రోజు కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వేసవి ప్రణాళికలో భాగంగా అవసరమైన నిధులు ఖర్చు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. చంపావతి నదిలో నీటి నిల్వలు అడుగంటిపోవటంతో ఆంధ్ర రిజర్వాయర్ నుంచి 50 క్యూసెక్కుల నీటిని మళ్లించేలా చర్యలు చేపడుతున్నాం. అంతేకాకుండా మూడు రక్షిత మంచి నీటి పథకాల వద్ద నిర్వహణ పనులు చేపట్టనున్నాం.

– ఎం. మల్లయ్యనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్.

#### వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం..

50 డివిజన్‌లుగా విస్తరించిన విజయనగరం కార్పొరేషన్‌లో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చేపట్టిన చర్యలు సత్ఫాలితాలనిచ్చాయి. ఇందులో భాగంగా గాజులరేగ, ధర్మపురి, కేఎల్‌పురం, బాలాజీనగర్, దాసన్నపేట, పూల్‌భాగ్ ప్రాంతాల్లో రూ.10 కోట్లతో 45 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్‌లు నిర్మించి ఆయా ప్రాంత ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. 2019 ఎన్నికలకు ముందు నగర వ్యాప్తంగా 18000 కుళాయిలు ఉండగా.... గడిచిన నాలుగున్నరేళ్లలో నూతనంగా 16,000 కుళాయి కనెక్షన్లు మంజూరు చేశారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకం నుంచి విజయనగరం వరకు 23 కిలోమీటర్ల పొడవున ఉన్న పైప్ లైన్లను రూ. 63 కోట్లతో మార్పు చేసేందుకు నిధులు మంజూరు చేశారు.



వైఎస్సార్‌సీపీ హయాంలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాలు

#### 27 మిలియన్ లీటర్ల నీరు పంపింగ్..

నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు నెల్లిమర్ల, రామతీర్థం, ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకాల నుంచి ప్రతిరోజూ 27 ఎంఎల్ నీటిని పంపింగ్ చేస్తున్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఆ నీటిని నగరంలోని 40 రిజర్వాయర్లకు పంపింగ్ చేసి అక్కడి నుంచి కుళాయిల ద్వారా ఒక రోజు 25 డివిజన్‌లకు, మరుచటి రోజు మరో 25 డివిజన్‌లకు నీటిని అందిస్తున్నారు. ఇందులో నెల్లిమర్ల, రామతీర్థం రక్షిత మంచినీటి పథకాల వద్ద 8 బావుల నుంచి 17 ఎంఎల్ నీటిని పంపింగ్ చేస్తుండగా.... ముషిడిపల్లి వద్ద ఉన్న 10 బావులు నుంచి మరో 10 ఎంఎల్ నీరు పంపింగ్ అవుతోంది. ముషిడిపల్లి రక్షిత మంచినీటి పథకం నుంచి వేసవి అంతా నీటిని పంపింగ్ చేసేందుకు అవసరమైన నిల్వలు ఉండగా.. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నెల్లిమర్ల, రామతీర్థం రక్షిత మంచి నీటి పథకాలు ఉండే చంపావతి నదిలో నీటి నిల్వలు అడుగంటిపోయాయి. దీంతో ఫిబ్రవరి 15న అంధ్ర రిజర్వాయర్ నుంచి నుంచి 43 కిలోమీటర్ల దూరంలో గల చంపావతి నదిలోకి నీటిని మళ్లించగా.... మార్చి మొదటి వారానికి ఆ నీరు చేరుకుంది. ఆంధ్ర రిజర్వాయర్ నుంచి వేసవి మొత్తానికి 50 క్యూసెక్కుల నీటిని మళ్లించేలా చర్యలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు తెలిపారు.